మనసులోని వ్యక్తిని
భర్తలో చూసుకున్న
ఆమె మనో
వేదనకు ముగింపు?

# గంటి వెంకటరమణ కథ

# డాక్టర్ ఐ లవ్ యు

డాక్టర్ కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చుని ఒక్కో పేషెంట్‌నే పరీక్ష చేసి పంపిస్తూ ఓ చోట ఆగిపోయాడు. పేషంట్ మాళవిక ఆరునెల్లనుంచీ క్రమంగా వస్తోంది. నెలకి మూడు నాలుగుసార్లు చొప్పున ఈ ఆరునెలల్లో అతనికి బాగా పరిచయం అయిపోయింది.

అందరికంటే ముందువచ్చి ఆఖర్న నిలబడుతుంది ఆ పిల్ల. పద్దెనిమిదేళ్లుంటాయేమో?

'ఇప్పుడెలా వుందీ', అతను అడిగాడు.

మాళవిక చెప్పింది: 'ఇప్పుడు నాకే బాధా లేదు. కడుపునొప్పి, తలనొప్పి అన్ని నొప్పులూ పోయాయి.'

'మరి మీకు ట్రీట్‌మెంట్ అయిపోయింది. ఇంక రావవసరం లేదు. జనరల్ టానిక్ తీసుకోండి' అతను కాష్ సర్దుకుని లేచాడు. మాళవిక మౌనంగా లేచి నిలుచుంది. ఒక్కోలైటే ఆర్పేస్తూ బయటికి వచ్చాక 'గుడ్‌నైట్ డాక్టర్' అంది. అతను గుడ్‌నైట్ చెప్పి స్కూటర్ ఎక్కేశాడు.

మాళవిక ఇంటికి రాగానే అన్నావదినలు ఆత్రంగా అడిగారు. 'ఎలావుందమ్మా'

'తలనొప్పి పగిలిపోతోందన్నయ్యా'

'పోనీ డాక్టర్ని మార్చి చూపిద్దాం' వదిన సలహా ఇచ్చింది.

'ఒద్దు, ఒద్దు' ఖంగారుగా అంది ఆమె. 'కొద్ది కొద్దిగా తగ్గుతోందన్నయ్యా. వేరే డాక్టర్ల దగ్గరికి వెళ్లాలంటే దూరం వెళ్లాలి. నేను అంతంత దూరం నడవలేను. బస్సుల కోసం వెయిట్ చేయలేను.'

'భోజనం చేయమ్మా' వదిన చెప్పింది.



మాళవిక ఆమెవైపు ఓసారి చూసి 'నాకు ఆకలి లేదొదివా ప్లీజ్' అని చెప్పేసి వెళ్లి మంచం మీద పడుకుంది. అన్నావదినా పక్క గదిలోకివెళ్లి లైటు ఆర్పేశారు.

మంచంమీద పడుకున్న మాళవికకి కిటికీలోంచి పూర్ణచంద్రుడు కనిపిస్తున్నాడు. అందంగా పిండారపోస్తూ ప్రకృతికి మరిన్ని అందచందాలు తీసుకువస్తున్నాడు. చలికాలం

వల్ల గాలితోబాటు చుట్టుపక్కల ఇళ్ళల్లోంచి నైట్‌క్వీన్ వాసనలు వాపికాగ్రాల్ని మృదువుగా స్పృశిస్తున్నాయి. మాళవికకి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

జానెడు, బెత్తెడు ఇంట్లో గొర్రెతోకలాంటి జీతంతో అన్నగారు తన కలల రాకుమారుడిని తీసుకురాలేడనే నిజాన్ని భరించలేకపోతోంది. ఆ కలల్లో సినిమాల్లో చూపించినట్లు చందమామలోంచి డాక్టర్ చంద్రకాంత్ మొహం అరవిచ్చిన మందార పువ్వులా నవ్వుతూ ఆమె మనసునీ, శరీరాన్నీ స్వాధీనం చేసుకుంటున్నాయి. అతని నవ్వులో, కళ్ళల్లో, నిలబడే తీరులో అందమైన ఆకారంలో, నిర్మలంగా కనిపించే మొహంలో ఏ కోణం లోంచీ కూడా ఆకర్షణని తప్పించుకోలేక పోతోంది.

డాక్టర్.... కనుకొలుకుల్లో నిరాశ తాలూకు కన్నీటి బిందువులు తొంగి చూస్తున్నాయి. అతను నాడి చూస్తున్నప్పుడు శరీరం భగ్గుమంటుంది. కోరికల దాహంతో అలా కాలిపోతున్న శరీరంలో జరిగే అలజడికి శక్తి లేదు కనుక సరిపోయింది. లేకపోతే అతనికి తెలిసిపోయి ఎంత చౌకబారుదానిగా అంచనా వేసుకుని వుండేవాడు?

నీలి మేఘాలు దట్టంగా చందమామని కప్పేయగానే వులిక్కిపడింది. డాక్టర్ దగ్గరికి ఇలా రోజూ ట్రీట్‌మెంట్ పేరుతో వెళ్లి, పది నిమిషాలు వుండి వచ్చేస్తే ఈ జన్మకీఫరక్ చాలు. రోజూ వెళ్ళగలదా తను? లోకం ఏమనుకుంటుంది. లోకం మాట దేవుడెరుగు. అన్నయ్యా, వదినా ఏమనుకుంటారు.

పోనీ అన్నయ్యతో చెబితే... ఛీ! ఏమని చెబుతుంది? అన్నయ్యా నేను డాక్టర్ని ప్రేమించాను. పెళ్ళికి ఏర్పాట్లు చేయి. అంటే తనవెలా చూస్తాడతను? పిచ్చాసుపత్రిలో జాయిన్ చేసినా చేస్తాడేమో... అయ్యో ఈ ప్రమాదం నుంచి బయటపడడం ఎలా?

మాళవిక అంత దుఃఖంలోనూ నవ్వుకుంది. ఆరునెల్ల పరిచయంలో వ్రేళ్లమీద లెక్కపెట్టగల్గేన్నిసార్లు వెళ్లగానే తనని ప్రేమించేస్తాడని వెర్రి వూహలతో ఆకాశానికి నిచ్చెనలు వేస్తోంది. అన్నేళ్లు చదివీ, ఆడామగా భేదం లేకుండా మెడిసన్ పూర్తిచేసిన ఆ డాక్టర్‌కి కన్నెపిల్లల కలలగురించేం తెలుస్తుంది. ఆడపిల్లగా అతను గుర్తించినట్లే కనిపించదు. ఎన్నో శరీరాల్ని అతను మార్చురీలో చూసి వుంటాడు. ఖండ ఖండాలుగా చేసిన ఆ శరీరంలో అతని కళ్ళకి సిరలూ, ధమనులూ, గుండె, కాలేయం, మూత్రపిండాలూ వగైరాలే కనిపిస్తాయిగానీ అపురూపమైన శరీరంతో సుకుమారంగా కనిపించే స్త్రీత్వం కనిపించి వుండదు బహుశా.

దూరంగా ఠాణాలో పన్నెండు గంటలు కొట్టారు. మాళవిక వులిక్కిపడింది. ఆ డాక్టర్ రూపం ఆమె శరీరంలో శరీరం, మనసులో మనసుగా కరిగిపోవడం ప్రారంభించి ఆరునెల్ల వయసుదాటి పోయింది. అతను లేకుండా తను బ్రతకగలదా? ఈ సంఘం, కట్టుబాట్లూ, వీటిని తెంచుకుని అతని దగ్గరకి వెళ్లి రెండుచేతులూ దోసిళ్లుగా మార్చి ప్రేమభిక్ష పెట్టమంటే ఓ శాంపిల్ బాటిల్‌ని తీసి ఆ చేతుల్లో వేస్తాడేమో? కాదంటే 'అమ్మాయ్ నీకు పెళ్లి పిచ్చి

పట్టుకుంది, మీవాళ్లని పిలుచుకురా మిగిలిన ఏర్పాట్లు నేను చూస్తానంటే...' మాళవికకి పుట్టెడు దుఃఖం ముంచుకు వచ్చింది. తన పేదరికంమీదా, పుట్టిన కొద్దిరోజులకే తన భారాన్ని అన్నా వదినలమీదవేసి వెళ్లిపోయిన తల్లిదండ్రులమీదా కోపంగా వుంది.


అయినా తనకి అందం ఒకటి వుంటే చాలా? చదువూ సంధ్యా కూడా అంతంత మాత్రంగానే వున్నాయి. రోజా పడుకునే సమయానికి కళ్ళు మూసుకుంది. ఓ చల్లని స్పర్శలాంటి నిద్ర ఆమె తన పరిష్వంగంలోకి తీసుకుంది.

* * *

'నాకు పెళ్ళా?' ఆ మాట పైకి అనలేదు మాళవిక. కొన్ని కొన్ని మాటలు మనసులో అగ్నిగుండంలో చిక్కుకుని ప్రజ్వరిల్లుతూ బద్దలవాలనే ప్రయత్నంచేసినా సంస్కారం అనే సముద్రం వాటిని మింగేస్తుంది.

బుద్ధిగా పెళ్లిపీటల మీద కూర్చుని లేచి చుట్టూ చూసేసరికి కాలం ఆ పీటని బారసాల పీట చేసింది. మూర్తి ఆమెని రెండు చేతుల్తో దగ్గరికి తీసుకున్నాడు! 'మాలా నేను చాలా అదృష్టవంతుడిని. నీ అందం నీ కొడుక్కిచ్చి నాకు బహుమతిని ఇచ్చావు.'

చిన్నగా నవ్వింది మాళవిక. ఎంతో దూరంలో వున్నా ఆమె మనో మందిరంలో డాక్టర్ మాత్రం తప్పుకోలేదు. పాపం పుణ్యం గురించి ఆమె అంతగా పట్టించుకోదు. మూర్తి ఆకారాన్నీ అతని మాటల్నీ పూర్తిగా డాక్టర్ చంద్రకాంత్‌లో లీనం అయినట్లు భ్రమలో బ్రతుకుతోంది. అసలీ పెళ్లికూడా చిత్రంగా జరిగింది. బజార్లో కూరలు బేరం ఆడుతూ చూశాడు మూర్తి. ఆ తరువాత రాయబారం పంపాడు. కానీ కట్నం లేకుండా గవర్నమెంట్ వుద్యోగం చేస్తున్న మూర్తి తన చెల్లెల్ని పెళ్లి చేసుకుంటానంటే భీమశంకరం 'సరే' అన్నాడు.



అతను చెల్లెల్ని మాటవరసకి కూడా 'పిల్లవాడు వచ్చాడామ్మా' అని అడగలేదు. అడిగే అవసరం లేదనుకున్నాడు. అతనికి తన పెంపకం మీద అంత నమ్మకం.

'మా వూరు వెళదామండీ' మాళవిక భర్తని అడిగింది. ఆమె ఏదీ కావాలని అడగదు. అతను వెంటనే ఒప్పుకున్నాడు. పిల్లవాడితో పుట్టింటికి వచ్చింది మాళవిక.

రెండురోజులు కుదురుగా గుండెని బిగపట్టుకుంది. మూడోరోజు సాయంత్రం వదినతో అంది. 'మళ్లీ తలనొప్పి, కడుపు నొప్పి వస్తోందొదినా. డాక్టర్ దగ్గరికి వెళ్తొస్తాను.'

వదినగారు ఆమెవైపు ఓసారి చూసి పిల్లవాడిని చేతుల్లోకి తీసుకుంది. మాళవిక రోడ్డుకి అవతలి వీధిలో వున్న డాక్టర్ దగ్గరికి వెళ్లింది. ఇప్పుడు జనం క్యూలో వున్నారు. ఆ క్యూ కూడా కొండవీటి చాంతాడులా వీధి మొగవరకూ వుంది. ఎలాగో వీలుచేసుకుని క్యూలో నిలుచుంది. నిలుచుని నిలుచుని కాళ్లు నొప్పి పుడుతున్నాయి. ఆమె వొంతు వచ్చేసరికి గంటపేపు పట్టింది. తలుపు తెరుచుకుని లోపలికి అడుగుపెట్టి నిర్ఘాంతపోయింది. అక్కడ చంద్రకాంత్ లేదు. ఎవరో వున్నారు. వయసు మీరిన ఆ డాక్టర్ ఆమెని పరీక్ష చేసి టాబ్లెట్స్ వ్రాసి ఇచ్చాడు. ఆమె పెదవులవరకూ డాక్టర్ గురించి అడగాలనే ఆలోచన వచ్చింది. అదీ పెదవుల చాటుకి వచ్చిన తప్పుకుంది.

దార్లో చిన్నగా నవ్వుకుంది ఆమె. ఐదేళ్లలో ఎన్నో మార్పులు వచ్చాయి. రోడ్లు వెడల్పయ్యాయి. ఇంద్రభవన్ ఆకాశంలోకి లేచింది. ఆ హోటల్ అంతకితం 'కాకాహోటల్'లా వుండేది. ఆ చుట్టూ ఖాళీ మైదానం ఇప్పుడు లేదు. జనసమ్మర్దంతో పట్టణం వాసనల్ని వెదజల్లుతోంది. డాక్టర్ ఏమయారు? కనీసం ఒక్కసారి కూడా చూడలేకపోయింది. పెళ్లికి పిలవమని అన్న చెప్పినా తను వినలేదు. మనసులో అతన్ని ప్రతిష్టించుకుని పెళ్లి పేరుతో ఆ ముసుగులో తన మాలిన్యాన్ని ఇంకా ఇంకా బహిర్గతం చేయాలంటే సిగ్గుతో అవమానంతో గిలగిల్లాడిపోయింది.

కాళ్లీడ్చుకుంటూ ఇంటికి రాగానే పిల్లవాడిని వదిన ఆడిస్తూ కనిపించింది. తన విచిత్రం అయిన ప్రేమకథ వదినకీ, అన్నయ్యకీ తెలుసో తెలియదో కానీ అతని గురించి అడగాలంటే దొంగతనం చేసినట్లనిపించింది.

'ఏమన్నారు డాక్టర్?' వదిన అడిగింది.

'ఏవో టాబ్లెట్స్ ఇచ్చారు వదినా. వ్రాసికూడా ఇచ్చారు. రేపు తీసుకుంటాను'

'మరిప్పుడు ఎలా?!'

'పూర్వంలా రావడంలేదు' మాళవిక గొంతు పట్టేసినట్లయింది. మరో రెండురోజులు అతి కష్టంమీద వుండగలిగింది. అన్నా వదినా ఎంత చెప్పినా వినకుండా వూరికి బయల్దేరి వెళ్లిపోయింది.

* * *

ఏళ్లు గడుస్తున్నా ఆమెలో మార్పు లేదు. ఆ శరీరం మనసూ ఆమెవి కాదు. పేపరు తప్పనిసరిగా చూస్తుంది.

మూర్తి అడిగాడు. 'మాలా నువ్వు పేపర్లో ఏం చదువుతావు?'

'అన్నీ?

'అన్నిటికంటే నీకు ఎక్కువగా ఏ శీర్షిక ఇష్టం?'

చిన్నగా నవ్వింది మాళవిక. 'బోన్‌వాయేజ్.'

మూర్తి నవ్వాడు! 'నీకు ఫారిన్ వెళ్లడం సరదా అయి వుంటుంది'.

'భలేవారే. పుట్టకెగరలేనిది స్వర్గానికి ఎగిరిందట. నేను... నేను ఫారిన్ వెళ్ళడమా? కలలోకూడా అనుకోను!

అతను సిగరెట్ వెలిగించి రింగులు వొదులుతూ చెప్పాడు. 'మన కోరికలు నిద్రాణం అయిపోతే మనకి తెలియకుండానే అవి ఇష్టాలరూపంలో బయటికి వచ్చేస్తాయి.'

'నాకే కోరికలూ లేవు'.

'అని నువ్వనుకుంటున్నావు. పదిహేనేళ్ళనుంచీ క్రమం తప్పకుండా నువ్వు ఆ ఒక్క శీర్షికకే అంత ప్రిఫరెన్స్ ఇచ్చి చదువుతున్నావంటే అదేదో లాజిక్‌కి సంబంధించిన విషయం అయి వుంటుంది.'

మాళవిక పేపర్ మడిచేసింది! మన పెళ్లి అయి ఇరవై ఏళ్లయింది. ఈ పేపర్ రేపటి నుంచీ తెప్పించద్దు!

'అరే! అతను బాధపడ్డాడు! నిన్ను నేను ఎగతాళి చేయడంలేదు మాలా. ఏదో పనీ పాటా లేనట్లు చిన్న విషయం బేస్‌గా తీసుకుని నేను అన్నందుకు నీ ప్రాణ ప్రదం అయిన పేపర్ తెప్పించడం మానేయమనడం అంత మంచిపని కాదు! అతను ఆమె బుగ్గమీద చిటికవేసాడు. మాళవిక కళ్లల్లోంచి నీళ్ల బయటపడకుండా జాగ్రత్త పడింది.

మూర్తి వైపు తదేకంగా చూస్తుంటే తన చేతకాని తనానికి సిగ్గు వేసింది. అతన్ని ఏ ఒక్క నిముషంలో కూడా 'మూర్తి'గా చూడలేదు. ఇంతకంటే మానసిక వ్యభిచారం వేరేవుండదు. మనసా, వాచా, కర్మణీనా ఈతడే తన భర్త. ఆమె చప్పున తల దించుకుంది. ఆ శరీరం మూర్తిది. అందులో తను ప్రతిష్ఠించుకున్నది చంద్రకాంత్‌ని ఇది మానసిక వ్యభిచారం ఎలా అవుతుంది. సన్నగా తలలో నరాలు చిట్లుతున్న భావన. ఎప్పుడూ ఆ డాక్టర్ ఆలోచనలతో, మనశ్శాంతి లేకుండా శరీరాన్ని కృశించుకువేట్లు చేసింది. పట్టుపట్టి కొడుకు నిఖిల్‌ని డాక్టర్‌ని చేసింది. ఆ పదంలో గ్లామర్ చూసి ఆరాధించిందా తను?

'మాలా నువ్వు రెస్టు తీసుకో. నేను

---



**జాగ్రత్త!**

డాక్టర్ దగ్గరికొచ్చాడు పేషెంట్.

"డాక్టర్! నాకు సడన్‌గా ఎదుటి మనిషిని చితకబాదేయాలని అనిపిస్తూ ఉంటుంది. నన్నేం చెయ్యమంటారు?" అడిగాడు.

"దయచేసి ముందు ఇక్కడనుంచి కాస్త బయటికెళతారా?" భయం భయంగా చూస్తూ అన్నాడు డాక్టర్ తన జాగ్రత్త కోసం.

—ఎస్.ఎస్.మూర్తి (వెల్లూరు)

వెదుతున్నాను' అతను వెళ్లిపోయాడు.

మాళవిక ఆ రాత్రి కిటికీ పక్కన మంచంమీద పడుకుంది. కాళిదాసు మేఘసందేశంలో మాదిరిగా ఇరవై ఏళ్ల నుంచీ తపించిపోతున్న తన గురించి డాక్టర్‌కి తెలిస్తే ఎంత బాగుండును? ఈ విషయం గుండె కవాటాలూ, మనసు పొరలూ, శరీరపు హద్దులూ దాటి బయటికి రాలేవు కదా? ఆమె ఆ నిశ్శబ్ద రాత్రిలో కన్నీరు మున్నీరు అయ్యేట్లు ఏడవడం ఎవరికీ తెలియదు.

డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చున్న కొడుకు తల్లితో చెప్పాడు. 'మమ్మీ మాకు ప్రొఫెసర్ వస్తున్నారు. లండన్‌లో పై చదువులు పూర్తి చేసి సెటిల్ అయి కొంతకాలం వుండి తిరిగి ఇండియామీద బుద్ధిపుట్టి వచ్చేస్తున్నారు. చాలా పేరు సంపాదించారాయన. ఇ.ఎన్.టి స్పెషలిస్టు. మిస్టర్ చంద్రకాంత్ అంటే వైద్యశాస్త్రజ్ఞులు మొత్తం ఎలర్ట్‌గా వుంటారు.

పరధ్యానంగా వున్న మాళవికకి మొదట అర్థం కాలేదు. తరువాత ఆమె వులిక్కిపడి కనుబొమ్మలు ముడివేసింది. 'ఎవరూ?' అని అడిగింది.

'డాక్టర్ చంద్రకాంత్ అమ్మా'

'డాక్టర్ చంద్రకాంతా? ఏవూరురా ఆయనది?'

'ఓ చెప్పడం మరచిపోయాను కదూ. మీ వూరే. ప్రస్తుతం మా హాస్పిటల్‌లో పోస్టింగ్ అయింది. ఆయన్ని రిసీవ్ చేసుకునేందుకు వెళ్లేవాళ్లలో నేనూ వున్నాను.'

మూర్తి ఓసారి భార్యవైపూ, మరోసారి కొడుకువైపూ చూశాడు. ఆ తరువాత తన పనిలో తను లీనం అయిపోయాడు. రెండు మూడు రోజులు చాలా భారంగా గడిచాయి.

ఆ తెల్లవారుజామున మాళవికకి చెవినొప్పి ప్రారంభం అయింది. గంటలు గడుస్తూంటే అది అంతకంతకూ ఎక్కువైపోతోంది. నిఖిల్ మందువేసినా తగ్గకపోవడంతో మూర్తి చెప్పాడు. 'నేను ఆఫీసుకు సెలవు పెట్టేందుకు లేదురా నిఖిల్ నువ్వు మీ అమ్మని హాస్పిటల్‌కి తీసుకువెళ్లు. స్పెషలిస్టు చేత చూపిస్తే తగ్గుతుందేమో?'

మాళవిక మంచం దిగలేకపోయింది.

కొడుకు హాస్పిటల్‌కి బయలుదేరుతూ ఆమెని తనతోబాటు స్కూటర్ మీద తీసుకువెళ్లాడు.

ఆమెని స్పెషల్ రూమ్‌లో కూర్చోబెట్టి అతను బయటికి వెళ్లిపోయాడు. మాళవిక గుండె చప్పుడు చెవుల్లోకి వినిపిస్తోంది. శరీరం అంతా ముచ్చెమటలు పోస్తున్నాయి. చంద్రకాంత్... డాక్టర్ ఐ లౌ యూ... స్టిల్ ఐ యామ్ లవింగ్ యూ... మంత్రోచ్చారణలా ఆమె పెదవులు కదులుతున్నాయి. పది నిమిషాల తరువాత ఆజానుబాహువు లాంటి విగ్రహంతో, ఇన్నాళ్ళూ విదేశాల్లో వున్న ప్రభావంవల్ల దబ్బపండు వంటి శరీరచ్ఛాయతో చంద్రకాంత్ ఆ రూమ్‌లోకి రాగానే పట్టపగలు వెన్నెల వాన కురిసినట్టూ ఆ కురిసిన వానలో తడుస్తున్నట్లూ మాళవిక అంతరంగం ఏదో తెలియని లోకాల్లోకి పరుగుపెడుతోంది.

అతను రాగానే బిడియంగా లేచింది ఆమె.

'మా అమ్మ మాళవిక' నిఖిల్ నోట్లోంచి ఆ మాట రాగానే చంద్రకాంత్ చటుక్కున కళ్ళద్దాలు తీసి తిరిగి పెట్టుకున్నాడు. వేలల్లో, లక్షల్లో అపురూపంగా వినిపించే పేరు అది.

నిఖిల్‌ని ఈ విషయం పెద్దగా కదిలించలేదు.

'మా అమ్మ దయ వుంటే!'

డాక్టర్ మామూలుగా అయిపోయారు. నిఖిల్ బయటికి వెళ్లగానే ఆమె దగ్గరగా వచ్చి ఆమె వైపు చూశాడు అతను. కొన ప్రాణంతో మిణుకుమిణుకుమనే దీపంలా వుందామె చూపు. ఒకటా రెండా ఇరవై ఏళ్లనుంచీ ఆ డాక్టర్ జాడ తెలియక నిరీక్షిస్తూ మీన మేషాలు లెక్కపెడుతోంది. అప్పటి యౌవ్వనపు మాధుర్యం క్రమంగా కరిగి గాంభీర్యం చోటు చేసుకుంది. ఆయన అడుగులో అడుగువేస్తూ ఆమె దగ్గరగా వచ్చాడు. రెండు చేతుల్తో ఆమె మొహాన్ని పైకెత్తి 'మాళవిక... మాళవిక కదూ... చెవి నొప్పా? ఏ చెవి?' అతను ఇప్పుడు అడిగే తీరు పేషెంట్‌ని అడిగినట్లు లేదు. ప్రేయసి చెవిలో గుసగుసలాడినట్లు మాళవికకి అనిపిస్తోంది. ఆమె కళ్ల చెమర్చాయి. అవి అశృవులయాయి. క్రమంగా జాలువారాయి. చెంపలమీద పడుతున్నాయి.

'మాళవికా... నీ కొడుకు డాక్టరా... నిఖిల్ మీ అబ్బాయా? నమ్మ లేకుండా వున్నాను' ఆయన జరిగి వచ్చేసాడు.

మాళవిక లేచి నిలుచుంది.

'మాళవికా రోజూ వస్తావా ఇక్కడికి'

అలసిపోయిన ఆమె సమాధానం చెప్పలేకపోతోంది.


'అప్పుడు... అప్పుడంటే చిన్నపిల్లవి కనుక వచ్చేదానివి. ఇప్పుడు బాధ్యతగల ఇల్లాలివి. పైగా డాక్టర్ తల్లివి. ఇప్పుడెలా రాగలవు?'

'నన్ను గుర్తుపట్టారా మీరు?'

డాక్టర్ ఆమెవైపు నిర్లిప్తంగా చూసాడు.

'మామూలుగా అయితే గుర్తు పట్టలేకపోయేవాడినేమో. నీ పేరు....'

'పిల్లలా'



## ప్లాస్మా స్థితి

ఏ పదార్థమయినా మూడు రకాల స్థితిలో వుంటుంది. అదే ఘన, ద్రవ, వాయు స్థితి. కానీ ఈ మూడే కాకుండా మరి నాల్గో స్థితి ఒకటి వుంది. దీన్ని ప్లాస్మా అంటారు. ఈ స్థితిలో పరమాణువులు పరమాణు స్థితిలో వుండవు. అవి ఎలెక్ట్రాన్లుగాను, పరమాణు గర్భాలుగాను విడిపోతాయి. సూర్యగోళంలోని వేడిమికి అక్కడ పదార్థం ఆ విధమైన ప్లాస్మా స్థితిలో ఉందని శాస్త్రజ్ఞులన్నారు.

—మధ్యాహ్నపు లీలానంద్

'లేరు'

'అందరూ వచ్చేశారా?'

'అందరూనా... ఓ.... డాక్టర్ ఫెుుల్లున వచ్చాడు. నాకు నేనే అందరూ... అయితే నువ్వు ఇక్కడ వుండడం ఎంత అదృష్టం.... అవునా?'

'దేనికీ'

'చెప్పలేను మాళవికా? అదంతే. నాకు పెద్ద పెద్ద డిగ్రీలున్నాయని చెప్పేందుకు మాటలు రావు'.

మాళవిక నీరసంగా కదిలింది.

'మళ్లీ వస్తావు కదూ'

ఆమె తల తిప్పింది. అతని కళ్లు ఆమెని వెంటాడుతున్నాయి. ఆ శరీరంలో ఆకర్షణ ఆమెని తిరిగి తనవైపు లాక్కుంటోంది. ఈ బాధా, వేదనా ఇరవైయేళ్లనుంచీ ఆమెని కోసేస్తున్నాయి. సరిగ్గా అప్పుడే నిఖిల్ వచ్చాడు. తల్లిని తీసుకుని బయటికి వచ్చేసాడు.

* * *

డియర్ మూర్తీ

మిమ్మల్నిలా సంబోధించడం న్యాయం కాదు. నాకేం తక్కువని చచ్చిపోవాలనుకున్నానో అనే ప్రశ్న మీరు వేసేసరికి నేను వుండను. నా శరీరం మాత్రమే మీది. ఇంక ఈ ఆకర్షణకి లొంగిపోలేను. నన్ను క్షమించండి.

ఏ జన్మలోనూ ఆడపిల్లగా పుట్టగూడదు. ఒకవేళ పుట్టినా గొప్పింట్లో పుడితే నాకీ నరకం తప్పేది. నేను డాక్టర్ చంద్రకాంత్‌ని చూస్తూ బతకలేను. ప్రతికి అప్రతిష్ట తీసుకురాలేను.

సెలవు

మాళవిక

మూర్తి ఆ కాగితాన్ని మంటల్లోకి విసిరేశాడు. అంతకంతకు అగ్నిజ్వాలలు ఆకాశాన్నంటు కుంటున్నట్లు లేస్తున్నాయి. డాక్టర్ నిఖిల్ తల్లి చనిపోయారని అందరూ వచ్చారు. స్మశానానికి వచ్చిన వాళ్లల్లో చంద్రకాంత్ కూడా వున్నాడు.

చంద్రకాంత్ కళ్లు తుడుచుకుంటూంటే మూర్తి ఆయన దగ్గరికి వచ్చాడు. అప్పటికి ఎక్కడివాళ్లు అక్కడికి సర్దుకున్నారు. 'కులగోత్రం... వీటి మధ్య మమ్మల్ని దూరం చేసారు వాళ్ల అన్నయ్య' చంద్రకాంత్ సిగ్గుపడడంలేదు. మూర్తితో చెప్పాడు.

'అవును. నాకూ చెప్పారు వాళ్లన్నయ్య. సమయం చేయి జారిపోకుండా నన్ను పెళ్ళి చేసుకోమని అడిగారు. పెళ్లీ పిల్లలమధ్య మరచిపోతుందేమో అనుకున్నాను. మాళవిక చాలా విచిత్రం అయిన వ్యక్తి. నన్ను బాధపెట్టినట్లు ప్రవర్తించేది కాదు. మీ కోసం ఇరవై ఏళ్లు పేపర్ చూసింది. మీరు రాగానే ఇద్దరూ మాట్లాడుకుంటారనే నిఖిల్‌కి ఫోన్ చేసి నా దగ్గరకి రప్పించుకున్నాను. .. మనసు విప్పి ఒకరితో ఒకరు మాట్లాడుకుంటారనుకున్నాను గానీ ఆమె ఇంత పని చేస్తుందని గ్రహించలేదు. మూర్తి నిర్వికారంగా అన్నాడు.

డాక్టర్ పెళ్లి చేసుకోలేదని మాళవికకి తెలిసి ఇంక బతకలేకపోయిందని ఇద్దరూ గ్రహించేసరికే ఆలస్యం అయిపోయింది.

చితికి దూరంగా కదిలారిద్దరూ.

చంద్రకాంత్ క్షణం ఆగి మూర్తి రెండు చేతులూ పట్టుకున్నాడు. 'యదార్థంగా మీరిక్కడున్నట్లు నాకు తెలియదు. తెలిస్తే వచ్చేవాడిని కాను. నన్ను క్షమించండి!

మూర్తి నవ్వాడు. ఆ నవ్వులో స్మశానవైరాగ్యం స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రకాంత్ సెలవు తీసుకొని వెళ్లిపోతుంటే కొడుకు కోసం ఇటు తిరిగిన మూర్తికి చల్లారిన మంటలు కనిపించాయి. ఆ మంటల్లో అంజలి ఘటిస్తూ మాళవిక మూర్తికి జోహార్లర్పిస్తున్నట్లు కనిపిస్తోంది. *

